www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 13 నవంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-189 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## పేదలను దోచుకునే వారిని వదిలే ప్రసక్తి లేదు

### తొలిసారిగా కెసిఆర్ ప్రభుత్వంపై ఘాటుగా స్పందించన మోడీ





- అవినీతి, కుటుంబ పాలనకు పాతర తప్పదు
- మునుగోడుతో మరితం ఉత్సాహం వచ్చింది
- ఎక్కడ అవినీతి ఉంటుందో అక్కడ కమలం వికసిస్తుంది
- కార్యకర్తలు బూత్‌స్థాయిలో ప్రజలను కలిసి కేంద్ర పథకాలు వివరించాలి
- తనను తిట్టడం తప్ప మరో కార్యక్రమం లేకుండా పోయింది
- విమర్శలతో తాను ఇంకా బలపడుతున్నానని వెల్లడి

**హైదరాబాద్, నవంబర్ 5 (సమ సమాజం):** తెలంగాణలో కమలం వికసిస్తుందని...అవినీతికి చరమగీతం పాడుతామని ప్రధాని మోడీ ప్రకటించారు. ఇక్కడ కుటుంబ పాలనకు, అవినీతి పాలనకు పాతరేయడం ఖాయమని మోడీ అన్నారు. విశాక నుంచి నేరుగా బేగంపేట చేరుకున్న మోడీ, ఇక్కడ బిజెపి ఏర్పాటు చేసిన సభలో మట్లాడారు. మునుగోడులో వచ్చిన ఉత్సాహంతో బిజెపికి ఉత్సాహం వచ్చిందన్నారు. కార్యకర్తలు బూతుస్థాయికి వెళ్లి ప్రజలకు కేంద్ర పథకాలను వివరిస్తూముందుకు సాగాలన్నారు. ఆత్మ విశ్వాసంతో ప్రజలకు చేరువ కావాలన్నారు. తెలంగాణ ప్రభుత్వంపైనా, కెసిఆర్ అవినీతి, కుటుంబ పాలనపైనా మోడీ పరోక్షంగా ఘాటు విమర్శలు చేశారు. పేదలను దోచుకునే వారిని వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. తెలంగాణ అభివృద్ధిలో పాల్గొనడం సంతోషంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మరోసారి కుటుంబ పరిపాలన, అవినీతిపై విమర్శలు చేశారు. పేదలను దోచుకునే వాళ్లను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ బీజేపీ మరింత బలపడుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కేసులు పెడుతున్నా బీజేపీ కార్యకర్తలు భయపడడం లేదన్నారు. అణిచివేతకు వ్యతిరేకంగా రాష్ట్రంలో పోరాటం కొనసాగుతోందని చెప్పారు. తెలంగాణ కార్యకర్తల పోరాటం తనకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోందని చెప్పారు.

3లో

## హిమాచల్‌లో ముగిసిన పోలింగ్

### వృద్ధులకు ఇంటివద్దనే ఓటేసే అవకాశం





**సిమ్లా, నవంబర్ 5 (సమ సమాజం):** హిమాచల్ ప్రదేశ్‌లోని 55 లక్షలమందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కుతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోనున్నారు. ఈ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ పోటాపోటీగా తలపడుతున్న సంగతి తెలిసిందే. ఉదయం నుంచి మందకొడిగానే పోలింగ్ జరిగింది. ఓటేసేందుకు వచ్చి ఓటేశారు. పోలింగ్ ముగియడంతో అధికారులు ఇవిఎంలను తరలించే పని చేపట్టారు. అయితే హిమాచల్ ప్రదేశ్‌లోని ఓ పోలింగ్ కేంద్రం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశంలో వున్న పోలింగ్ కేంద్రంగా రికార్డు సృష్టించింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని కిన్నౌర్ జిల్లాలోని తాషిగ్యాంగ్ గ్రామం 15,256 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఈ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రమే ప్రపంచంలోని అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఏర్పాటైన పోలింగ్ కేంద్రంగా ఎన్నికల కమిషన్ గుర్తించింది. ఈ గ్రామంలో కేవలం 52 మంది ఓటర్లే ఉండడం గమనార్హం.

3లో



## తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టు పాత్ర కీలకం

### వారు గల్లీనుంచి ఢిల్లీ దాకా తెగించి పోరాడారు

- ఉద్యమంలో వారి మద్దతుతోనే కెసిఆర్ ముందుకు సాగారు
- రాజకీయాల్లోకి రావడమన్నది అంత సులువు కాదు
- ప్రతిభ లేకుంటే ప్రజలు ఆదరించనే ఆదరించరు
- వార్తలను నిష్పక్షపాతంగా అందించడంపై దృష్టి పెట్టాలి
- జర్నలిస్టుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం
- మీడియా సదస్సులో మంత్రి కెటిఆర్ వెల్లడి

**హైదరాబాద్, నవంబర్ 5 (సమ సమాజం):** తెలంగాణ ఉద్యమంలో మీడియా మిత్రుల పోరాటం మరువలేదని మంత్రి కేటీఆర్ అన్నారు. నిజాంకి వ్యతిరేకంగా షోయబుల్లాఖాన్ నిర్భయంగా పోరాడారని... సురవరం ప్రతాపరెడ్డి పోరాటం మరువ లేనిదన్నారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన నాడు మీడియా యాజమాన్యాలు సహకరించకపోయినా మీడియా ప్రతినిధులు సహకారం ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. అందుకే సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో మీడియా మిత్రులకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో జరిగిన మీడియా ఇన్ తెలంగాణ సదస్సుకు మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జర్నలిస్టులు తెలంగాణ కోసం ఢిల్లీలో కూడా పోరాడారని, వారిని మరువలేవమని.. వారి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని చెప్పారు. సంక్రాంతి

3లో



## తెలంగాణ హామీలు ఏమయ్యాయి

### రామగుడంలో మోడీకి వ్యతిరేకంగగా ఫ్లెక్సీలు

**రామగుండం, నవంబర్ 5 (సమ సమాజం):** ప్రధాని మోదీ నేడు రామగుండంలో పర్యటించనున్న నేపథ్యంలో ప్రధానమంత్రికి వ్యతిరేకంగా పట్టణంలో ఫ్లెక్సీలు వెలిసాయి. తెలంగాణకు మోదీ ఇచ్చి హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తూ గుర్తుతెలియని వ్యక్తులు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. టీఐఆర్

3లో



## కెసిఆర్‌కు మర్యాద కూడా తెలియదు

### ప్రధానిని ఆహ్వానించే సంస్కారం కూడా లేదు

### కెసిఆర్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

### మోడీ వ్యతిరేక ఫ్లెక్సీలపై రఘునందన్ రావు ఆగ్రహం

**హైదరాబాద్, నవంబర్ 5 (సమ సమాజం):** తెలంగాణ సీఎం కేసీఆర్ కు మర్యాద లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధాని మోదీకి స్వాగతం పలకాలన్న సంస్కారం కూడా లేదన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. కేసీఆర్‌కు తెలంగాణ అభివృద్ధి పట్టదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా గవర్నర్‌ను అవమానిస్తున్నారన్నారు. ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి లేదన్నారు. కిరాయి రౌడీలతో బ్యానర్లు కట్టినంత మాత్రాన మోదీని అడ్డుకోలేరన్నారు. మళ్లీ మళ్లీ వస్తాం.. వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా ఏం చేయలేరన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సంస్కారం ఉన్న వ్యక్తి ఎవరైనా మోడీ గో బ్యాక్ అని ఫ్లెక్సీలు పెడతారా అని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు ఆగ్రహం

3లో

## మోడీ రాకతో రామగుండంలో భారీ బందోబస్తు

### సిపిఐ ఆందోళన పిలుపుతో పోలీసుల అప్రమత్తం

### పలువురు సిపిఐ నేతల అరెస్ట్..పోలీస్ స్టేషన్‌లకు తరలింపు



3లో

## రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు: మంత్రి తలసాని



**హైదరాబాద్, నవంబర్ 5 (సమ సమాజం):** హైదరాబాద్ సనత్ నగర్ లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యటించారు. వివిధ శాఖల అధికారులతో కలిసి ఎర్రగడ్డ చౌరస్తా నుంచి సనత్ నగర్ పోలీస్ స్టేషన్ వరకు పాదయాత్రగా నడిచి రోడ్డును పరిశీలించారు. రోడ్ల ఆక్రమణతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తలసాని తెలిపారు. రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణలను తొలగించి ఈ నెలాఖరులోగా సనత్ నగర్ బస్ స్టాప్ నుంచి ఎర్రగడ్డ వరకు రోడ్డు విస్తరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్లన్నీ ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కేసులు నమోదు చేయాలని పోలీసులకు మంత్రి సూచించారు.

## తెలంగాణ పర్యటనకు వచ్చి ఏం చేసినట్లు



### ఉత్తుత్తి మాటలతో ప్రజలను మభ్యపెట్టిపోయారు

### అసలు సమస్యలపై ఎందుకు స్పందించలేదు

### మోడీ పర్యటనపై విమర్శలు గుప్పించిన కవిత

3లో



## హైదరాబాద్‌లో మోడీకి ఘనంగా స్వాగతం

### స్వాగతించిన గవర్నర్ తమిళసై, తలసాని, కిషన్ రెడ్డి

2లో

## సంపాదకీయం

# ఢిల్లీ కాలుష్యంపై ఏటా నిర్లక్ష్యమే!

ప్రతియేటా ఢిల్లీ కాలుష్యం గురించి చర్చించడం..దీపావళి ముందు పటాసులను కాల్చకుండా అడ్డు కోవడం.. పంట వ్యర్థాలను తగుటబెట్టవద్దని కొన్ని సూచనలు చేయడంతో సరిపెట్టడంతో ఢిల్లీ కాలుష్యాన్ని అరికట్టలేకపోతున్నాం. మనచేతుల్లో ఉన్న పనిని కూడా చేయలేకపోతున్నాం. కారణం కేవలం చేతకానితనం తప్ప మరోటి కాదు. గత కొద్ది సంవత్సరాలుగా ఈ వాయు కాలుష్య సమస్యను రూపుమాపే కార్యాచరణ సాగడం లేదు. దేశరాజధాని న్యూఢిల్లీ పరిస్థితే ఇలా ఉంటే ఇక మిగతా పట్టణాల సంగతి వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇది ప్రభుత్వాల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యగా చూడాలి. వాయు కాలుష్యానికి వాస్తవ కారణాలు ఏమిటో గుర్తించి వాటిని నివారించేందుకు చేపట్టవలసిన చర్యలను ఆచరించడం లేదు. గత నాలుగైదేళ్లుగా అక్టోబర్,నవంబర్ మాసాల వార్తలను పరిశీలిస్తే ఇది అర్థం కాగలదు. ఢిల్లీలో వాయు కాలుష్యానికి మూలాలు బయట ఉన్నాయని నగర ప్రభుత్వం చెబుతోంది. ఆ బయటి మూలాలు ఏంటంటే పంట వ్యర్థాలను తగులబెట్టడం అన్నది తేల్చారు. ఏటా చలికాలం రాగానే ఢిల్లీ ప్రజలువాయుకాలుష్యం ప్రకటనలతో కలత చెందుతుంటారు. నగరంలో వాయు కాలుష్యం అత్యధిక స్థాయికి చేరే సమయమిదేనని తేలింది. ఈ భయంకర పరిస్థితులుకు కారణం ఏమిటి,కారకులు కారకులు ఎవరు అన్నది సకాలంలో గుర్తించి సమస్యను పరిష్కరించుకోవచ్చు. కానీ దీనిని నివారించే బదులు రాజకీయ నాయకులు పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్లనే కాలుష్యం వస్తుందన్న భావనలను ప్రచారం చేస్తున్నారు. వివిధ విభాగాల అధికారులు తప్పు తమది కాదని, ఇతరులదని తప్పించుకోజూస్తున్నారు. ఇలా చేస్తే తమపైకి నిదం రాకుండా చూసుకుంటున్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలయాపన అన్నది ఏటా జరిగే తంతుగా మారింది. ఈ క్రమంలో సుప్రీం చీఫ్ జస్టిస్ గా బాధ్యతలు చేపట్టిన డివై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో కాలుష్య నివారణకు సరైన పరిష్కారాలను అన్వేషించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ సూచించారు. ఢిల్లీ, ఇతర ఉత్తర భారత రాష్ట్రాల్లోరైతులు పంటల వ్యర్థాలను పొలాల్లోనే తగులబెట్టడం వల్ల వాయు కాలుష్యం పెరిగిపోతోందని, దీన్ని నివారించాలంటే పంట వ్యర్థాల కాల్చివేతపై పూర్తి నిషేదం విధించాలని కోరుతూ న్యాయవాది శశాంక్ శేఖర్ ఝూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని అత్యవసర ప్రాతిపదికన విచారణ చేపట్టాల్సిందిగా వినువించారు. అయితే ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ హిమాకోహ్లీ, జస్టిస్ జెబి పార్థీవాలాతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. నిషేదం విధించడం వంటివి కచ్చితంగా న్యాయ వ్యవస్థ పరిధిలోకి వచ్చే అంశాలు కాదని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. 'రైతుల పంట వ్యర్థాల కాల్చివేత తర్వాత చూద్దాం! ముందు ఢిల్లీ కాలుష్య నివారణకు మీ వద్ద ఉను పరిష్కారమేమిటి' అని పిటిషనర్‌ను నిలదీశారు. దీనికి న్యాయవాది శశాంక్ శేఖర్ ఝూ స్పందిస్తూ ఢిల్లీలో కాలుష్య నివారణకు పంటల వ్యర్థాల కాల్చివేతపై నిషేదం అత్యంత ప్రధానమైందనిపునరుద్ఘాటించారు. దీనిపై స్పందించిన సిజెఐ కాబట్టి దీని మీాము నిషేధించాలా నిషేదం విధించినంతనే ఆగిపోతుందా పంజాబ్, యుపిలోని రైతు రైతుకు నిషేదం విధించాలా అని ప్రశ్నించారు. అందువల్ల, ఈ అంశాని ప్రాధాన్యతగా జాబితా చేయడానికి నిరాకరించారు. అంటే ఒక్క పంట వ్యర్థాలను కాల్చకుండా చూడడమొక్కటే కాదని పరోక్షంగా తెలియచేశారు. కాలుష్య నివారణకు వాస్తవ పరిష్కారాలను అన్వేషించాలని తెలిపారు. ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించడంలో కోర్టు తక్షణ జోక్యం చేసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు గత వారం అంగీకరించింది. 'ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది' అని అప్పటి సిజెఐ జస్టిస్ యుయు లలిత్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అలాగే నవంబర్ 10 గురువారం ఈ అంశాన్ని జాబితా చేయడానికి కోర్టు అంగీకరించింది. పిటిషన్‌ను గురువారం విచారించిన సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం అత్యవసర విచారణకు తిరస్కరించింది. నిజానికి కాలుష్యానికి కారకంగా ఉన్న సంస్థలూ వ్యవస్థలూ ఏవో మనకు స్పష్టంగా తెలుసు. ఏ రంగం ఏ మేరకు ఈ వాయు కాలుష్యానికి కారణమవుతున్నదో కచ్చితమైన లెక్కలు ఉన్నాయి. అయితే ఈ రంగాలూ వాటి లెక్కలూ ఒక అధ్యయ నానికీ, మరో అధ్యయనానికీ మారిపోతుంటాయి. ఏటేటా ఇదే తీరుగా ఉంది. నిజానికి ఒక్క పంటల కాల్చివేత వల్లే ఇంతగా కాలుష్యం వస్తుందని అనుకుంటే పొరపాటు. వాహన కాలుష్యం, ఫ్యాక్టరీలు, డీజిల్ జెనరేటర్లు, విద్యుత్కేంద్రాలు, గృహాలలో వంట కార్యకలాపాలు, రోడ్లపై దుమ్మూ ధూళీ, భవనాల నిర్మాణం జరుగుతున్న ప్రదేశాలు మొదలైనవి కూడా వాయు కాలుష్యానికి కారణం అవుతున్నాయి. వీటిపై ఎవరు కూడా గట్టిగా మాట్లాడడం లేదు. దుమ్మూ ధూళి కాలుష్య కారకం కాదుకానీ విషపూరితమైనది. ఎందుకంటే కంబస్టన్ ఉద్గారాలతో అది మిళితమవుతుంది. ఏటా ఉద్గారాలను నివారించేందుకు చేపట్టిన చర్యలేమిటిని ప్రశ్నించుకుంటే సున్నా.. వాతావరణం ప్రతికూలంగా ఉన్నప్పుడు కాలుష్యం స్థాయి పెరుగుతుంది. గాలి విషపూరితమవుతుంది. అలాగే నగరం నుంచి తరలించిన పరిశ్రమల సంఖ్య తక్కువేమీ కాదు. అయితే అవి ఇప్పటికీ బొగ్గు తదితర ఇందనాలతో నడుస్తున్నందున వాటి కాలుష్యం కూడా బాగానే వస్తోంది. ఢిల్లీ శివారు ప్రాంతాలలో ఉన్న ఇలాంటి పరిశ్రమలు నగరంలో వాయు కాలుష్యానికి మరింతగా కారణమవుతున్నాయి. ఎండుగడ్డిని బొగ్గుకు బదులుగా ఇంధనంగా వినియోగించుకునే సుదూర ప్రదేశాల లోని పరిశ్రమలకు రవాణా చేసే వసతులు కూడా రైతులకు లేవు. ఎండుగడ్డిని విలువైనదిగా రైతులు పరిగణిచేందుకు చేయవలసింది చాలా ఉన్నది. అందుకు ఏడాది పొడుగునా నిర్ణయాత్మక చర్యలు ఎన్నో చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. కాలుష్యంపై అనవసర, అర్థరహిత చర్చలు పక్కన పెట్టి సమస్య పరిష్కారానికి చేపట్టవలసిన పటిష్ఠ చర్యలపై సంబంధిత అధికారులూ ప్రభుత్వ విభాగాలూ ప్రైవేట్ పరిశ్రమల వారూ దృష్టిని కేంద్రీకరిస్తే తప్ప ఇది తప్పించుకోలేని సమస్య. ఏటా ఇలాంటి వాదనలు రావడం, తరవాత మర్చి పోవడమూ జరుగుతుంది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# కాంగ్రెస్ గుజరాత్ ఎన్నికల ప్రణాళిక విడుదల



## నరేంద్రమోడీ స్టేడియం పేరును పటేల్ పేరుగా మారుస్తామని ప్రకటన

గాంధీనగర్,నవంబర్12(సమ సమాజం): గుజరాత్‌లో అధికారంలోకి వస్తే అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం పేరును సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంగా మారుస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. రాష్ట్రంలో 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న కాంగ్రెస్ ... ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొంది. రాష్ట్రంలోని వితంతువులు, వృద్ధులకు నెలకు రూ. 2,000 చొప్పున ఫించన్ మంజూరు చేస్తామని తమ మేనిఫెస్టోలో పేర్కొంది. అంతేకాకుండా 3,000 ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ లను ఏర్పాటు చేస్తామని, రాష్ట్రంలోని బాలికలకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు ఉచిత విద్యను అందిస్తామని మేనిఫెస్టోలో తెలిపింది. ఇక రైతులకు రూ. 3 లక్షల వరకు రుణమాఫీ , 300 యూనిట్ల ఉచిత విద్యుత్, నిరుద్యోగులకు రూ. 3,000 నిరుద్యోగ భృతి, రూ. 500 కే గ్యాస్ సిలిండర్లు అందిస్తామని కాంగ్రెస్ వాగ్దానాలు చేసింది. గుజరాత్‌లోని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం విపరీతమైన అవినీతికి పాల్పడుతుందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గత 27 ఏళ్లలో జరిగిన అన్ని అవినీతి ఫిర్యాదులపై విచారణకు ఆదేశించి, దోషులపై కేసులు నమోదు చేస్తామని వెల్లడించింది. గుజరాత్‌లో డిసెంబర్ 1, 5 తేదీల్లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. డిసెంబర్ 8న ఓట్ల లెక్కింపు జరగనుంది.

## ఆంక్షలు ఉల్లంఘించిన వాహనాలపై జరిమాన

న్యూఢిల్లీ,నవంబర్12(సమ సమాజం): వాయు కాలుష్యం నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ నగరంలో బీఎస్-3, బీఎస్-4 వాహనాలపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై అధికారులు కొరడా ఝులిపించారు. ఇప్పటి వరకు 5,800 వాహనాల యజమానులకు అధికారులు చలాన్లు జారీ చేశారు. ఆయా వాహనాల కదలికలపై ఈ నెల 13 వరకు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం వరకు ఆంక్షలు ఉల్లంఘించిన 5,882 వాహనదారులకు చనాన్లు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ఫేజ్-3 కింద ఢిల్లీలో బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ ఫోర్ వీలర్ వాహనాలపై నిషేధం విధించినట్లు చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలకు రూ.20వేల వరకు జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. ఆదివారం ఆంక్షలు అమలులో ఉండనుండగా.. వాయు నాణ్యత తగ్గని క్రమంలో మళ్లీ పొడిగించే అవకాశాలున్నాయని రవాణాశాఖ అధికారులు పేర్కొన్నారు.

## ఐఎస్‌బిలో ర్యాగింగ్ కలకలం

### కేటీఆర్ ఆదేశాలతో విచారణ..12మందిపై కేసు

హైదరాబాద్,నవంబర్12(సమ సమాజం): హైదరాబాద్ శివార్లలోని ఇండియన్ బిజినెస్ స్కూల్ లో ర్యాగింగ్ ఘటన కలకలం రేపుతోంది. ఓ జూనియర్ ను సీనియర్లు చితక బాదారు. రూమ్‌లో డోర్ పెట్టి అతడిని తీవ్రంగా కొట్టారు. ర్యాగింగ్ అనంతరం విద్యార్థులు కాలేజ్ గ్రూప్స్ లో వీడియోలను అప్లోడ్ చేశారు. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఇరువురిని పోలీసులు రాజీకుదుర్చి పంపించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఘటనపై బాధిత విద్యార్థి మంత్రి కేటీఆర్ కు ట్విట్టర్లో ఫిర్యాదు చేశాడు. నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ మంత్రి కేటీఆర్ సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్రకు సూచించారు. మంత్రి ట్వీట్ తో ర్యాగింగ్ కు పాల్పడిన 12మందిపై శంకర్ పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ 12 మంది విద్యార్థులను కాలేజీ యాజమాన్యం సంవత్సరం పాటు సస్పెండ్ చేసింది. దర్యాప్తు అనంతరం మరికొంత మంది స్టూడెంట్స్ పై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కాలేజీ విద్యార్థులకు.. దొంతనపల్లి గ్రామ శివారులో ఎప్పుడూ గొడవలు జరుగుతుంటాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## పుణె బంగారు నగల దుకాణంలో చోరీ

### బురఖా వేసుకున్న మహిళల పనిగా గుర్తింపు

పుణె,నవంబర్12(సమ సమాజం): పునేలోని ఒక బంగారు నగల దుకాణంలో బుర్ఖా ధరించిన ఇద్దరు మహిళలు బంగారు నగల్నిచోరీ చేశారు. పునేలోని చందానగర్‌లో ఉన్న నహర్ అనే బంగారు నగల దుకాణంలోకి ప్రవేశించిన వీళ్లు బంగారు చెవి కమ్మలు దొంగతనం చేశారు. ఆ చెవి కమ్మల విలువ రూ.1.5 లక్షలు ఉంటుందని షాపు యజమాని యశ్ నహర్ చెప్పాడు. అయితే, అక్టోబర్ 26వ తేదీనే ఈ దొంగతనం జరిగింది. కానీ, ఈ విషయాన్నిదుకాణంలోని ఉద్యోగులు ఎవరూ గుర్తించలేదు. రెండు రోజుల క్రితం కంప్యూటర్‌లో నగల జాబితాని చెక్ చేస్తుండగా బంగారు కమ్మలు కనిపించలేదు. దాంతో అనుమానం వచ్చిన షాపు యజమాని సీసీ టీవీ పుటేజీ చెక్ చేశాడు. అక్టోబర్ 26వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు బుర్ఖా ధరించిన ఇద్దరు మహిళలు వచ్చారు. నగలు చూపించాలని సేల్స్‌మెన్‌ని అడిగారు. కొంతసేపటి తర్వాత ఆ ఇద్దరు మహిళలు హడావిడిగా దుకాణం నుంచి బయటకు వెళ్లడం గమనించాడు. వాళ్లే దొంగతనం చేసి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ టీవీ పుటేజీ పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## నరబలి కోసం పసిబాలుడి కిడ్నాప్

### మహిళను అరెస్ట్ చేసిన పోలీసులు

న్యూఢిల్లీ,నవంబర్12(సమ సమాజం): చనిపోయిన తండ్రిని బతికించాలంటేజజ నరబలి కోసం పసిబాలుడ్ని ఒక మహిళ కిడ్నాప్ చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. గర్హి ప్రాంతానికి చెందిన ఒక గర్భిణీ సప్దర్‌జంగ్ హాస్పిటల్‌లో పండంటి బాబుకు జన్మనిచ్చింది. గురువారం ఒక మహిళ ఆ ఆసుపత్రికి వచ్చింది. రెండు రోజుల కిందట జన్మించిన పసిబాబు కుటుంబాన్ని కలిసింది. తాను ఒక ఎన్జీవో సంస్థ సభ్యురాలినని వారితో చెప్పింది. బాబు ఆరోగ్యాన్ని పరిశీలిస్తామని చెప్పి వారిని తన వెంట తిప్పింది. ఆ రోజు సాయంత్రం ఆ పసికందును ఆమె కిడ్నాప్ చేసింది. బాబు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఆసుపత్రిలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. పసిబాబును కిడ్నాప్ చేసిన మహిళను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితురాలిని 25 ఏళ్ల శ్వేతగా గుర్తించారు. బాబు కిడ్నాప్‌పై ఆమెను ఆరా తీశారు. అయితే నవజాత శిశువును నరబలి ఇస్తే చనిపోయిన తన తండ్రి బతుకుతాడన్న మూఢ నమ్మకంతో ఈ పని చేసినట్లు పోలీసులకు చెప్పింది. దీంతో ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజస్థాన్‌లో దారుణ ఘటన

### దొంగతనానికి వచ్చి ఇల్లాలుపై అత్యాచారం
### ముగ్గురు దుండగుల పట్టివేత..ముమ్మర దర్యాప్తు

జైపూర్,నవంబర్5(సమ సమాజం): రాజస్థాన్‌లో దొంగతనానికి వచ్చు దుండగులు దోచుకోవడమే గాకుండా ఇంటి ఇల్లాలుపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఆలస్యంగా వెలుగు చూసింది. దొంగలకు ఇంట్లోకి చొరబడి భర్త ఎదుటే భార్యపై నలుగురు సామూహిక అత్యాచారం చేసిన సంఘటన రాజస్థాన్ రాష్ట్రం సిరోహి జిల్లాలో జరిగింది. ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేయగా ఒకరు పరారీలో ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరూప్‌గంజ్‌లో నలుగురు దుండగులు ఓ ఇంట్లోకి చొరబడ్డారు. దంపతులను బెదిరించి రూ 1400 నగదు, బంగారు, వెండి ఆభరణాలు లాక్కున్నారు. అనంతరం భర్తను కట్టేసి భార్యపై నలుగురు సామూహిక అత్యాచారం చేశారు. భర్త ఈ విషయం బయటకు తెలిస్తే పరువుపోతుందని దాచిపెట్టాడు. రెండు రోజుల తరువాత భార్య తన భర్తతో కలిసి రోహిడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే ఆమెను ఆరోగ్య పరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఒక దుండగుడు మాత్రం పరారీలో ఉన్నాడని పోలీస్ అధికారి దేవరామ్ తెలిపారు. ఉన్నతాధికారులు ఈ ఘటనపై సీరియస్ గా తీసుకొని ముమ్మరంగా దర్యాప్తు చేపడుతున్నారు.

# కెసిఆర్ తీరుపై బిజెపి నేతల ఆగ్రహం



ప్రధాని మోడీని స్వాగతించకపోవడం దారుణం● విమర్శలు గుప్పించిన అరుణ,జితేందర్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్12(సమ సమాజం): సీఎం కేసీఆర్ పై బీజేపీ సీనియర్ లీడర్లు విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీ వచ్చినప్పుడు.. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులను పంపించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని ముందు నిలబడటానికి కూడా కేసీఆర్ ఎందుకు రావడం లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రశ్నించారు. అలాగే.. కాంగ్రెస్ పార్టీ పైనా ఆమె విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రిని విమర్శించే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని ఆమె అన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని కాంగ్రెస్ హయాంలో పూర్తి చేస్తే.. ఇప్పటివరకు ఎందుకు ప్రారంభించలేదని ఆరోపించారు. ఇప్పుడు బీజేపీ నిర్వహిస్తున్నది ఎన్నికల సభ కాదని హామీలు ఇచ్చేందుకు ఇంకా చాలా సమయం ఉందని డీకే అరుణ చెప్పారు. సీఎం కేసీఆర్ కు ప్రోటోకాల్ పాటించే పద్ధతి తెలియదా అని మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి ÷ర్ అయ్యారు. ప్రధాని వస్తుంటే సీఎం స్వాగతం పలుకాలనే విషయం కూడా తెలియదా అని ఘాటుగా ప్రశ్నించారు. నగరంలో మోడీ గో బ్యాక్ అంటూ వెలసిన ప్లెక్సీలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని ఆయన చెప్పారు. రైతుల కోసం రామగుండంలో ఎరువుల ఫ్యాక్టరీ ప్రారంభిస్తున్నట్లు జితేందర్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రజలకు అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని.. కేంద్ర ప్రభుత్వ సాయంతోనే చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వడ్లు కొనడం కూడా చేతకాని బిజెపి● విమర్శలు గుప్పించిన మంత్రి ఎర్రబెల్లి

వరంగల్,నవంబర్5(ఆసమ సమాజం): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రైతు బీమా, రైతుబంధు, కాళేశ్వరం ప్రాజెక్టు, 24 గంటల కరెంటు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. సీఎం కేసీఆర్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు. వరంగల్ జిల్లాలోని రాయపర్తిలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ఎర్రబెల్లి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వడ్లు కొనడం చేతకాని బీజేపీ అడ్డగోలు రాజకీయం చేస్తున్నదని విమర్శించారు.÷ాష్ట్రంలో అమలవుతున్న పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడన్నా అమలులో ఉన్నాయా అని ప్రశ్నించారు. విమర్శలు చేసేముందు ప్రతిపక్షాలు ముందుగా ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. అంతకుముందు రాయపర్తి మండలానికి చెందిన 60 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను మంత్రి ఎర్రబెల్లి పంపిణీ చేశారు.

## మోడీ పర్యటనకు వ్యతిరేకంగగా ఓయూలో నిరసనలు

### ఆందోళనకు దిగిన విద్యార్థి నేతల అరెస్ట్

హైదరాబాద్,నవంబర్12(సమ సమాజం): ప్రధాని మోడీ తెలంగాణ పర్యటనను నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వద్ద విద్యార్థి సంఘం నాయకులు ఆందోళన నిర్వహించారు. మోడీ తెలంగాణ రాష్ట్రంలోకి అడుగుపెట్టొద్దు అంటూ టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో.. విద్యార్థి సంఘం నాయకులు నిరసనకు దిగారు. నల్ల జెండాలతో ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ గో బ్యాగ్ అంటూ నినాదాలు చేశారు. నిరసనకారులను పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, నిరసనకారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు విద్యార్థులను బలవతంగా పోలీసులు వ్యాన్ ఎక్కంచి స్టేషన్?కు తరలించారు. ఇదిలా ఉంటే.. బంజారాహిల్స్ లోని కేబీఆర్ పార్కు వద్ద తెలంగాణ చేనేత యూత్ ఫోర్స్ నిరసన వ్యక్తం చేశారు. గో బ్యాక్ మోడీ అంటూ నినాదాలు చేశారు. నల్ల బెలూన్లు గాల్లోకి ఎగురవేసి యూత్ ఫోర్స్ సభ్యులు నిరసన తెలిపారు. చేనేత మీద ఐదు శాతం జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో సీపీఐ, సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మోడీ పర్యటనను అడ్డుకుంటామన్న సిపిఐ, సిపిఎం నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేస్తున్నారు. మధ్యాహ్నం మోడీ తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో.. గస్తీ కాస్తున్నారు. మోడీ పర్యటనలో ఎలాంటి ఆటంకం కలుగకుండా భద్రత కట్టుదిట్టం చేశారు.

## చేనేతపై జిఎస్టీ ఎత్తేయాలి

### కెబిఆర్ పార్క్ వద్ద నల్ల బెలూన్లు ఎగరేసి నిరసన

హైదరాబాద్,నవంబర్12(సమ సమాజం): చేనేతపై విధించిన 5 శాతం జీఎస్టీని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ చేనేత యూత్‌ఫోర్స్ డిమాండ్ చేసింది. జీఎస్టీని వెనక్కి తీసుకున్న తర్వాతే రాష్ట్రంలో అడుగుపెట్టారన్నారు. నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర సర్కార్ కార్పొరేట్లకు కొమ్ముకాసే ప్రభుత్వమని విమర్శించారు. ప్రధాని మోదీ పర్యటణకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద తెలంగాణ చేనేత యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో నల్ల బెలూన్లను ఎగరవేసి యువత నిరసన వ్యక్తం చేశారు.

# మహారాష్ట్రలో పెద్ద మొత్తంలో నకిలీ రూ.2 వేల నోట్లు

### ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ముంబై,నవంబర్12(సమ సమాజం): మహారాష్ట్రలో పెద్ద మొత్తంలో నకిలీ రూ.2 వేల నోట్లు దొరికాయి. వీటి విలువ దాదాపు రూ.8 కోట్ల వరకు ఉండనున్నది. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న థానే క్రైమ్ బ్రాంచ్ పోలీసులు.. వీరి వెనకున్న ముఠా మూలాలను లాగే పనిలో నిమగ్నమయ్యారు. నకిలీ కరెన్సీ ప్రింటింగ్ ముఠా గుట్టును థానే క్రైమ్ బ్రాంచ్ పోలీసులు రట్టు చేశారు. నిందితుల నుంచి భారీగా రూ. 2000 నకిలీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు రూ.8 కోట్ల విలువైన రూ.2000 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ నోట్లను మార్కెట్లోకి విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగున్న సమయంలో.. అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి నకిలీ నోట్లను స్వాధీనపర్చుకున్నారు. ఈ కేసులో పాల్ఘర్‌కు చెందిన రామ్ శర్మ, రాజేంద్ర రౌత్‌లను థానే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నకిలీ నోట్లను ముద్రించిన ముఠా నుంచి నకిలీ రూ.2000 నోట్లున్న 400 కట్టలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ నోట్ ప్రింటర్ల నెట్‌వర్క్ ఎంత వరకు విస్తరించి ఉన్నదనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మార్కెట్‌లో రూ.2000 నోట్ల కొరత ఉండడంతో మోసగాళ్లు లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. నకిలీ నోట్లను మార్కెట్‌కు తరలించే పనిలో ఉండగా పట్టుబడటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయిందని, లేదంటే పెద్ద మొత్తంలో నకిలీ నోట్లు మార్కెట్లోకి వచ్చి సామాన్య ప్రజానీకం ఇబ్బందులపాలయ్యేదని పోలీసులు అంటున్నారు.

# శంషాబాద్‌లో భారీగా బంగారం పట్టివేత



హైదరాబాద్,నవంబర్12(సమ సమాజం): బంగారం అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నా కొందరు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలతో గోల్డ్ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టులో దుబాయ్ నుంచి వస్తున్న ప్రయాణికుల వద్ద నుంచి రూ. 3 కోట్ల విలువైన 5.5 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ఏమాత్రం అనుమానం రాకుండా బంగారాన్ని పేస్టు గా మార్చి లోదుస్తులలో దాచి అక్రమంగా బంగారాన్ని తలిచేందుకు కేటుగాళ్లు యత్నించారు. దుబాయ్ నుంచి వస్తున్న అమీర్ ఖాన్, మహ్మద్ ఖురేషీ అనే ఇద్దరు ప్రయాణికుల ప్రొఫైల్ పై అనుమానం కలగడంతో కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకొని తనిఖీలు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.బంగారం అక్రమ రవాణా వెనుక ఎవరెవరు ఉన్నారనే విషయాలపై కూపీ లాగుతున్నారు.

# హైదరాబాద్‌లో మోడీకి ఘనంగా స్వాగతం



(మొదటి పేజి తరువాయి) హైదరాబాద్,నవంబర్12(సమ సమాజం): ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన ముగించుకుని.. నేరుగగా హైదరాబాద్ చేరుకున్నారు. బేగంపేట ఎయిర్‌పోర్టులో ప్రధాని మోడీకి.. గవర్నర్ తమిళి సై, కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మోడీకి స్వాగతం పలికారు. అనంతరం బేగంపేట్ ఎయిర్ పోర్టులో ప్రధాని మోడీ సభను నిర్వహించారు. ఈ సభకు బీజేపీ ముఖ్య నేతలతో పాటు13 మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. సభా వేదికపై మోడీని బీజేపీ ముఖ్య నేతలు సన్మానించారు. రామగుండం పునరుద్ధరణతో ఎరువుల కష్టాలు పోయాయని బీజేపీ ముఖ్య నేతలు అభిప్రాయపడ్డారు. మోడీ పర్యటన నేపథ్యంలో 1500 మంది పోలీసులతో బేగంపేట్ పరిసరాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. మరో 100 మంది కేంద్ర బలగాలతో నిఘా పెట్టారు.రామగుండం ఎరువుల కర్మాగారాన్ని మోడీ సందర్శించనున్నారు. రామగుండం ఎరువుల కార్మాగారాన్ని ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు.

# తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టు పాత్ర కీలకం



(మొదటి పేజీ తరువాయి) తర్వాత మీడియా భవన్ నిర్మిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. తెలంగాణలో ఆదాయం పెరిగిందని.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంద న్నారు. రాష్ట్రాభివృద్ధిపై ప్రజలకు మీడియా ఎందుకు చెప్పటం లేదని ప్రశ్నించారు. పేదల కోసం పనిచేసే ప్రభుత్వంపై సోషల్ మీడియాలో వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అది సోషల్ మీడియా కాదని..యాంటీ సోషల్ మీడియానా అనే భావన కల్గుతుందన్నారు. ప్రశ్నించేవాళ్లు లేకపోవడంతో కొందరు చెలరేగిపోతున్నారన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో వెనక్కి వెళ్తుందని.. కోవిడ్ సమయంలో పేదలను ఆదుకునేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఉద్దీపన ప్యాకేజీ రూ.20 లక్షల కోట్లు ఎక్కడికి పోయాయని మంత్రి నిర్మలా సీతారామన్‌ని అడిగారా? అని ప్రశ్నించారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తే మీడియా పై దాడులు చేయడం సరికాదన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని..ఈ దేశం ఎట్లా ఉండాలనేది ప్రసార మాధ్యమాలు చెప్పాలని కేటీఆర్ సూచించారు. తాను రోజుకు గంటన్నరసేపు పేపర్ చదువుతానని..పేపర్ రాని రోజు తనకు ఏమీ తోచదన్నారు. పత్రికల్లో వచ్చే వార్తల్లో ఏది నిజం..ఏది అబద్ధం అని తెలియని పరిస్థితి నెలకొందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఒకప్పుడు జర్నలిస్ట్‌లు నిర్భయంగా వార్తల రాసేశారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అలా జరగడం లేదన్నారు. దేశంలో మీడియా మారిందన్నారు. ప్రధాని మన్ కి బాత్ మనమే వినాలి మన మాట ఆయన వినరని విమర్శలు చేశారు. ప్రపంచంలో గొప్ప సంస్థలు హైదరాబాద్ లో ఉన్నాయి.. వాటి గురించి మీడియా ఎందుకు రాయదని ప్రశ్నించారు. తాము తప్పుచేస్తే చీల్చిచెండాలని సూచించారు. తాము మంచి చేసినప్పుడు మంచిగా రాయాలన్నారు. ఇకపోతే రాజకీయాల్లో ప్రవేశాలకు మాత్రమే వారసత్వం ఉపయోగ పడుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రతిభ లేకుండా రాజకీయాల్లోనూ ఎవరూ రాణించలేరని, సొంతంగా నిరూపించుకోలేకపోతే ఏ వారసత్వాన్ని కూడా ప్రజలు భరించరన్నారు. ఇందిరాగాంధీ వంటి మహానేతలనే ప్రజలు ఓడించారు. మొదటి ఎన్నికల్లో తాను చాలా కష్టం గెలిచాను.. పనితీరుతోనే సిరిసిల్లలో తన మెజారిటీని క్రమంగా పెంచుకోగలిగానని చెప్పారు. సరిగా పనిచేయకపోతే సిరిసిల్ల ప్రజలు తనను కూడా పక్కన పెట్టేవారని చెప్పారు. ఏది న్యూసో, ఏది వ్యూసో తెలుసుకోవడానికి అనేకసార్లు పేపర్లు చదవాల్సి వస్తుందన్నారు. ఐదు కేటగిరీల వాళ్లనే జనం చదువుతున్నారని పత్రికలు కూడా వాళ్లకే ప్రాధాన్యమిస్తున్నా యని వెల్లడించారు. స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ ఉద్యమంలో పత్రికలు కీలకపాత్ర పోషించాయని కేటీఆర్ అన్నారు. షోయబ్ ఉల్లా ఖాన్ తెలంగాణ జర్నలిస్టులకు ఒక స్ఫూర్తి అని, గోలకొండ పత్రికతో సురవరం పోషించిన పాత్ర మరువలేనిదని చెప్పారు. పత్రికా యాజమాన్యం కంటే తెలంగాణ జర్నలిస్టుల పోరాట స్ఫూర్తి ఎక్కువని చెప్పారు. ఉద్యమ రోజుల్లో పత్రికా యాజమాన్యాలు తెలంగాణకు, టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉండేవని గుర్తుచేశారు. జర్నలిజం ముసుగులో ఇప్పటికీ వ్యక్తిగత దూషణలు, బూతులు తిడుతున్నారని చెప్పారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆయన గురించి రాసిన పత్రికల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదని మంత్రి వెల్లడించారు. యాజమాన్యాలు ఎలా ఉన్న టీఆర్ఎస్‌కు అండగా నిలబడింది తెలంగాణ జర్నలిస్టులేనని చెప్పారు. స్టింగర్ల నుంచి డెస్క్ వరకు తమకు సపోర్టుగా నిలబడటంతోనే తెలంగాణ సాధించగలిగామన్నారు. తెలంగాణ జర్నలిస్టులు ఢిల్లీదాక వచ్చి తెలంగాణ కోసం కొట్లాడారని గుర్తుచేశారు. జర్నలిస్టుల ప్రాధాన్యాన్ని సీఎం కేసీఆర్ ఏనాడు తగ్గించలేదని చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం నిధులు కేటాయించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. 19 వేల అక్రిడేషన్ కార్డులున్న జర్నలిస్టులు రాష్ట్రంలో ఉన్నారన్నారు. మున్సిపల్ శాఖ థాంక్ లెస్ జాబ్ అని మంత్రి కేటీఆర్ అన్నారు. 22 వేల మంది పారిశుధ్య సిబ్బంది రెక్కలు ముక్కలు చేసుకున్నా చిన్న అభినందన రాదని వ్యాఖ్యానించారు. రెండు కాలనీల్లోకి నీళ్లు రాగానే హైదరాబాద్ నీట మునిగిందని రాస్తారని విమర్శించారు. అతిశయోక్తి అలంకారం గురించి తనకు తెలుసని, దాన్ని ఎంతలా వాడుకోవాలో అంతే వాడాలని సూచించారు. పత్రికలు చదవకుంటే ఏమీ తెలియదు.. చదివితే ఏది నిజమో తెలియదన్నట్లుగా ప్రస్తుతం పరిస్థితి మారిపోయిందన్నారు. భారత ప్రధాని చేసిన ఒత్తిడి వల్ల అదానీకి రూ.6 వేల కోట్ల ప్రాజెక్టు ఇచ్చామని శ్రీలంక చెప్పిందన్నారు. అదానీకి ఇచ్చిన ప్రాజెక్టుపై ఏ ఒక్క మీడియా అయినా అక్కడికి వెళ్లి నిజానిజాలు నిగ్గుతేల్చిందా అని ప్రశ్నించారు. నచ్చని జర్నలిస్టులకు చంపేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయన్నారు. బిలియన్ డోసుల కరోనా వ్యాక్సిన్లను హైదరాబాద్ ఉత్పత్తి చేసిందని, కరోనా వ్యాక్సిన్ల గురించి మన మీడియా ఎందుకు హైలెట్ చేయలేదని వాపోయారు. జో బైడెన్ ప్రయాణించే హెలికాప్టర్ క్యాబిన్ కూడా హైదరాబాద్‌లోనే తయారయిందన్నారు. మిషన్ కాకతీయ వల్ల చెరువు కట్టలు బలంగా ఉండి తెగడంలేదన్నారు. చెరువు కట్టలు తెగితే వార్తకానీ.. బలంగా ఉంటే వార్త కాదా అని ప్రశ్నించారు. భూగర్భ జలాలు లేకుంటే వార్త కానీ, భూగర్భ జలాలు పెరిగితే ప్రచురణార్హం కాదా అని వ్యాఖ్యానించారు. 'పాలు, మాంసం, చేపల ఉత్పత్తుల్లో రికార్డులు సృష్టించాం. ఐదు రకాల విప్లవాలతో తెలంగాణ గ్రామీణ వ్యవస్థ పరిపుష్టమైంది. ప్రభుత్వ చర్యలతో తెలంగాణ సమతుల్యమైన అభివృద్ధి సాధిస్తున్నది. పల్లె ప్రగతి, పట్టణప్రగతి, అభివృద్ధి, సంక్షేమం ఇవేవీ వార్తలు కాదా?.. హైదరాబాద్‌లో 7 శాతానికి పైగా గ్రీన్ కవరేజ్ పెరిగింది.. దీనికి పతాక శీర్షిక ఉండదా?. ఏ మీడియాలో అయినా పాజిటివ్ కంటే నెగెటివే ఎక్కువ వ్యాప్తి చెందుతున్నది. సోషల్ మీడియానా లేదా యాంటీ సోషల్ మీడియానా అర్థం కావడంలేదు' అని మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా కమిటీ ఛైర్మన్ అల్లం నారాయణ,శైలేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హిమాచల్‌లో ముగిసిన పోలింగ్



(మొదటి పేజీ తరువాయి) తోషిగ్యాంగ్‌తోపాటు లాహుల్ – స్పితి జిల్లాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలు కూడా ఎత్తైన ప్రదేశాల్లోనే ఉన్నాయి. ఈ పోలింగ్ కేంద్రాల్ని ఎన్నికల అధికారులు సుందరంగా అలంకరించి.. ఓటర్లుకు ఘన స్వాగతం పలికారు. దీనికి సంబంధించిన వీడియోను ఎలక్షన్ కమిషన్ తన అధికారిక ట్విటర్ ఖాతా ద్వారా పోస్టు చేసింది.శనివారం జరిగే 68 అసెంబ్లీ ఎన్నికల స్థానాలకు ఎన్నికల సంఘం 7,884 పోలింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేసింది. ఈ ఎన్నికల్లో సీనియర్ సిటిజన్లు, వికలాంగ ఓటర్లు సులభంగా ఓటు వేసేలా ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.హిమాచల్ ప్రదేశ్ లోని చంబా జిల్లాలోని చురాలో 105 ఏళ్ల వృద్ధురాలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. చురా అసెంబ్లీ నియోజకవర్గంలోని లధన్ పోలింగ్ స్టేషన్ లో 105 ఏళ్ల వయసున్న నరోదేవి ఓటు వేశారు. 80ఏళ్ల పైబడిన ఓటర్లకు తమ ఇళ్ల వద్దే బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. కానీ ఆ సదుపాయాన్ని నరో దేవి మాత్రం స్వీకరించలేదు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం ద్వారా ఓటు వేసేందుకు సుముఖత చూపింది. ఇదిలా ఉండగా హిమాచల్ ప్రదేశ్ లో 68 అసెంబ్లీ స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఉ.11గంటల వరకు 17.98శాతం ఓటింగ్ నమోదైనట్టు తెలుస్తోంది. కాగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని ఇప్పటికే సీఈసీ రాజీవ్ కుమార్ తెలిపారు.

# తెలంగాణ పర్యటనకు వచ్చి ఏం చేసినట్లు



(మొదటి పేజీ తరువాయి) జగిత్యాల,నవంబర్12(సమ సమాజం): తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీపై టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నిప్పులు చెరిగారు. రాష్ట్రానిక ప్రధాని మోదీ ఖాళీ చేతులతో వచ్చారని, ఉత్తమాటలు, లేని మాటలు, ఉత్తుత్తి మాటలు చెప్పి పోయారు తప్పా చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. తెలంగాణకు ఏం చేశారని పలుసార్లు ప్రధానిని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ రెండు, మూడుసార్లు ప్రెస్‌మీట్లు పెట్టి మా రాష్ట్రానికి ఏం చేశారని మోదీని ప్రశ్నించారు. దానికి మోదీ నుంచి సమాధానం రాలేదు. తప్పించుకుని తిరుగుతున్నారు. ఇవాళ వచ్చి ఏదో చిన్న ప్రారంభోత్సవం చేసి వెళ్లిపోతున్నారు. ఈ విషయాన్ని జగిత్యాల ప్రజలంతా గమనించాలి. ఉత్తి మాటలు చెప్పేవాళ్లేవరూ? అభివృద్ధి చేసే నాయకులేవరు .. ఉట్టి మాటలు చెప్పే పార్టీ ఏది? ముఖంచాటేసే పార్టి ఏది? అన్నది ప్రజలు గుర్తించేలా కార్యకర్తలు పనిచేయాలని కవిత సూచించారు. జగిత్యాల నియోజకవర్గం పరిధిలోని రాయికల్ మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన టీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో కవిత పాల్గొని ప్రసంగించారు. జగిత్యాలను సంజయ్ అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. పట్టుదలతో పనిచేస్తున్న సంజయ్‌కి తాము అంతా అండగా ఉండి సహాయసహకారాలు అందిస్తామని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో విప్లవం సృష్టించినట్లే ఈ దేశంలో కూడా గులాబీ కండువా విప్లవం సృష్టించబోతుందని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. జగిత్యాల నియోజక వర్గం రాయికల్ మండల కేంద్రంలో టీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొని ప్రసంగించారు. టీఆర్ఎస్ పార్టీ అంటే మన రికార్డులు మనమే తిరగరాసుకునేవాళ్లం. మనం వేరే వాళ్ల రికార్డులు బద్దలుకొట్టుడు కాదు అని కవిత పేర్కొన్నారు. మన లక్ష్యం ఒక్కటే ఉండాలి. గులాబీ కండువా అధికారంలో ఉన్నప్పుడే తెలంగాణ ప్రజలు సురక్షితంగా ఉంటారు. గులాబీ జెండా ఎగిరే నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుంది. అందుకో సం 24 గంటలు కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. గతంలో మంత్రిగా ఉన్న జీవన్ రెడ్డి నియోజకవర్గాన్ని పట్టించుకోలేదు. ఒకప్పుడు రాయికల్ వలసల మండలంగా ఉండే. ఇప్పుడు పంటలమయం అయిపోయింది. కాంగ్రెస్ హయాంలో కేవలం 20 వేల ఎకరాల్లో వరి సాగు జరిగేది. కేసీఆర్ సీఎం అయ్యాక 65 వేల ఎకరాల్లో వరి పంట సాగు జరుగుతుంది. రైతుల ముఖాల్లో సంతోషం వెల్లివిరిసిందని కవిత తెలిపారు. మన నాయకుడు కేసీఆర్ అన్ని వర్గాల గురించి ఆలోచిస్తున్నారు. గత పాలకులు బీడీ కార్మికుల ఓట్లు అడిగారు కానీ పెన్షన్లు ఇవ్వలేదు. కానీ కేసీఆర్ బీడీ కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నారు. ఒక్క రాయికల్ మండలంలోనే 16700 మంది లబ్ధిదారులకు పెన్షన్లు ఇస్తున్నాం. చేసిన పనిని చెప్పాలి. చేయాల్సిన పనిని బాధ్యతతో చేయించాలని కార్యకర్తలకు కవిత సూచించారు. మన ప్రధాని మోదీ వస్తున్నాడని ముఖం చాటేశారని జీవన్ రెడ్డి అంటున్నాడు. మరి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పాదయాత్ర చేసుకుంటూ తెలంగాణకు వచ్చిండు. ఆయన ఎప్పుడైతే తెలంగాణకు వచ్చిండో.. మునుగోడు ప్రజలకు కాంగ్రెస్ నాయకులు ముఖం చాటేశాడు. మా నాయకుడు ఎప్పుడూ కూడా ముఖం చాటేయలేదు. ముఖం చాటేసేది బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మాత్రమే. అనుకున్న లక్ష్యం సాధించే వరకు నిలబడే నాయకుడే నిజమైన నాయకుడు అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ ఏనాడూ కూడా విశ్వాసం కోల్పోలేదు. టీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా ఉందన్నారు. ఇవాళ దేశ వ్యాప్తంగా విప్లవం సృష్టించాలని బీఆర్ఎస్ ఏర్పాటు చేశారు. భారతదేశంలో కూడా గులాబీ కండువా విప్లవం సృష్టిస్తదని విశ్వాసం ఉందన్నారు. కేసీఆర్‌ను ఏదో ఒకటి అని జీవన్ రెడ్డి వార్తల్లో నిలిచే ప్రయత్నం చేస్తున్నాడు. జీవన్ రెడ్డి మంత్రిగా ఉండి రోళ్లవాగు ప్రాజెక్టు ప్రస్తావన తీసుకురాలేదు. కానీ రూ. 135 కోట్లతో రోళ్లవాగును నిర్మాణం చేసుకుంటున్నాం. అనేక మోసాలు చేసి అభివృద్ధికి అడ్డుపడ్డది జీవన్ రెడ్డినే. ముఖం చాటేసింది ఆయనే. టీఆర్ఎస్ పాలన పారదర్శకంగా కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు.

## తెలంగాణ హామీలు ఏమయ్యాయి

(మొదటి పేజీ తరువాయి)ఏర్పాటు ఎంతవరకు వచ్చిందని, టెక్స్‌టైల్ పార్కు ఏమైందని, మిషన్ భగీరథకు ఎన్ని నిధులు ఇచ్చారని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఎక్కడికిపోయిందని, డిఫెన్స్ కారిడార్, బయ్యారం స్టీల్‌ప్లాంట్, మెడికల్ కాలేజీలు ఎన్ని ఇచ్చారని, పసుపు బోర్డు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని, ఐఐఎం ఏమైందని ప్రశ్నల రూపంలో నిలదీశారు. ఇప్పటికే చేనేతపై విధించిన జీఎస్టీని ఎత్తివేసిన తర్వాత తెలంగాణకు రావాలని పేర్కొంటూ అక్కడక్కడ ఫ్లెక్సీలు, బ్యానర్లు వెలసిన విషయం తెలిసిందే.

## కెసిఆర్‌కు మర్యాద కూడా తెలియదు

(మొదటి పేజీ తరువాయి) వ్యక్తం చేశారు. హైదరాబాద్ ను ప్లాస్టిక్ రహిత నగరంగా చేస్తానన్న వ్యక్తి.. హైదరాబాద్ లో ఫ్లెక్సీలు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి బహిరంగ లేఖను చెత్తబుట్టలో వేసుకోండి.. లేదంటే గాంధీ భవన్ ను ఆ పేపర్ లతో తుడుచుకోండి అంటూ కామెంట్స్ చేశారు. ఇక ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనను నిరసిస్తూ ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనను నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వద్ద విద్యార్థి సంఘం నాయకులు, తెలంగాణ చేనేత యూత్ ఫోర్స్ ఆందోళన నిర్వహించారు. మోదీ తెలంగాణ రాష్ట్రంలోకి అడుగుపెట్టొద్దు అంటూ నిరసనకు దిగారు. నల్ల జెండాలతో ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ గో బ్యాగ్ అంటూ నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు.

## మోడీ రాకతో రామగుండంలో భారీ బందోబస్తు

పెద్దపల్లి,నవంబర్5 (సమ సమాజం): ): ప్రధానమంత్రి మోడీ పర్యటన సందర్భంగా రామగుండంలో సభా ప్రాంగణం దగ్గర భద్రత కట్టుదిట్టం చేశారు. మోడీ రాక సందర్భంగా బీజేపీ నేతలు రామగుండం గోదావరిఖని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని కాషాయమయంగా మార్చేశారు. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగ సభలో పాల్గొనున్నారు. సాయంత్రం 6.40గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రధాని మోడీ ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఆందోళనలు చేపట్టారు. మోడీ పర్యటనను అడ్డుకుంటామని చెప్పిన స్థానిక ప్రతిపక్ష నేతలు హెచ్చరిం చారు. ఈ నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్యను గోదావరిఖని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాని పర్యటన, సభలో ఆందోళన చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రానికి ప్రధాని మోడీ అన్యాయం చేశారని వామపక్ష పార్టీలు ఆందోళన చేపట్టాయి. గోదావరిఖనిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుని పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాని మోడి పర్యటనను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు హోరెత్తుతున్నాయి. మోడీ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి కూనంనేని సాంబశివరావు రామగుండానికి బయలుదేరారు. పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి మంచిర్యాల జైపూర్ స్టేషన్‌కి తరలించారు. దీంతో సాంబశివరావు పోలీస్ స్టేషన్‌లోనే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ... ఈ అరెస్ట్‌లు అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఎక్కడో జిల్లాల్లో నిరసనలు తెలియజేస్తే.. మోడీకి హాని జరుగుతుందా ? అని ప్రశ్నించారు. నిరసన తెలియచేయడం పౌరుల ప్రజాస్వామిక హక్కు అని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇకపోతే ఎపిలోనూ నిరసనలు వ్యక్తం అయ్యాయి. ఏపీని అన్ని విధాలుగా మోసం చేసి, సిగ్గు లేకుండా రాష్ట్రానికి వస్తున్నారని విమర్శించారు. ఏపీకి మోడీ ప్రభుత్వం ఒక్క అంశంలో అయినా న్యాయం చేసిందా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి హోదా లేదు, పోలవరం పూర్తి కాలేదని వారు ఆరోపించారు. విభజన హామీలు అమలు చేయకపోయినా ఘన స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉంటే.. మోడీ పర్యటనలో ఎలాంటి నిరసనలు, ఆందోళనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. మూడు వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

# తెలంగాణలో ఇక కమల వికాసం




(మొదటి పేజీ తరువాయి) రాష్ట్రంలో బీజేపీ వికసించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కష్ట సమయంలో జనం బీజేపీకి అండగా ఉన్నారని అన్నారు. మంత్రులను తీసుకోవడం తీసేయడం కూడా మూఢవిశ్వాసాలతో చేస్తున్నారని మోదీ చెప్పారు. 22 ఏళ్లుగా తాను తిట్లు తింటూనే ఉన్నానని, ఆ తిట్లే తనకు బలంగా మారుతున్నాయని చెప్పారు. కొంతమంది నిరాశవాదులు అదే పనిగా తిడుతుంటారని, రాష్ట్ర పాలకులకు తనను తిట్టడమే తెలుసన్నారు. తాను రోజుకు 3 కేజీలు తిట్లు తింటున్నానని, ఆ తిట్లే నాకు బలంగా మారుతున్నాయని చెప్పారు. పేదల ఎదుగుదలకు అవినీతే అడ్డు అని చెప్పారు. కమ్యూనిస్టులు అభివృద్ధి నిరోధకులు అని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం పోయి బీజేపీ ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. పసుపు రైతులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మునుగోడు ప్రజలు ఉప ఎన్నిక సందర్భంగా బీజేపీకి ఒక భరోసా ఇచ్చారని అన్నారు. తాను కూడా బీజేపీలో చిన్న కార్యకర్తనని అన్నారు. ప్రధాని ప్రసంగిస్తున్న సమయంలో బీజేపీ కార్యకర్తలతో మోడీ మోడీ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యకర్తల ఉత్సాహాన్ని చూసి మోడీ సంతోషం వ్యక్తం చేశారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ జాతికి అంకితం చేయబోతున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో కార్యకర్తలతో మాట్లాడాలని సంజయ్ కోరారని... నేను కూడా మీలానే బీజేపీకి చెందిన చిన్న కార్యకర్తను అని చెప్పుకొచ్చారు. తెలంగాణ కార్యకర్తలను చూసి స్ఫూర్తి పొందానని తెలిపారు. పీపుల్స్ ఫస్ట్.. అనేది బీజేపీ నినాదమన్నారు. ఇక్కడి కార్యకర్తలను బలమైన శక్తులు.. ఎవరికీ భయపడరని అన్నారు. తెలంగాణ పేరు చెప్పి పార్టీలు పెట్టినవారు పదవులు అనుభవిస్తు న్నారని... ప్రజలకు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రధాని విమర్శించారు. తెలంగాణలో కమల వికాసం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. మునుగోడు ఎన్నికలో ప్రజలు బీజేపీకి ఒక భరోసా ఇచ్చారని... ఒక్క సీటు కోసం రాష్ట్ర ప్రభుత్వమంతా మునుగోడుకు పోయిందని వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఉప ఎన్నిక ఫలితాన్ని చూస్తుంటే తెలంగాణలో కమలం వికసించే రోజు దగ్గరలోనే ఉందని ధీమా వ్యక్తం చేశారు. మీరెంత గట్టిగా పోరాడారో ఉపఎన్నిక చూస్తుంటే అర్థమవుతోందన్నారు. తెలంగాణలో అంధకారం ఎక్కువ రోజులుండదని తెలిపారు. తెలంగాణలో వచ్చేది బీజేపీ సర్కారేనని ప్రజలు చాటి చెప్పారని ప్రధాని మోదీ అన్నారు.అవినీతి, కుటుంబ పాలన ఎంతో కాలం ఉండదని ప్రధాని మోదీఅన్నారు. తెలంగాణలో అవినీతి రహిత పాలన అందించేందుకు సిద్ధమన్నారు. పేదలను దోచుకునేవారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. తెలంగాణలో మూఢనమ్మకాలతో ఏం జరుగుతోందో దేశ ప్రజలకు తెలియాలన్నారు. కేబినెట్‌లో ఎవరిని ఉంచాలో.. ఎవరిని తీసేయాలో.. మూఢనమ్మకాలు నిర్ణయిస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా కొన్ని దుష్టశక్తులు ఏకమయ్యా యన్నారు. అవినీతిపరులంతా ఒక్కటయ్యేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. బీజేపీ కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్లాలన్నారు. 22 ఏళ్లుగా ఎందరితోనో ఎన్నో తిట్లు తిన్నాను.. రోజు కిలోల కొద్దీ తిట్లు తింటాను.. అందుకే అలసిపోనన్నారు. మోదీని తిట్టేవాళ్లను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. చక్కగా తిట్లు వింటూ.. చాయ్ తాగుతూ ఎంజాయ్ చేయాలన్నారు. తెలంగాణ సర్కార్‌కు రోజూ మోదీని తిట్టేందుకే సమయం సరిపోతోందన్నారు. మీరెన్ని తిట్లు తిట్టినా వాటిని అరిగించుకునే శక్తి తమలో ఉందన్నారు. తెలంగాణ సమాజాన్ని తిడితే మాత్రం అంతకంతా ప్రతీకారం తప్పదని మోదీ పేర్కొన్నారు. గతంలో రేషన్ బియ్యం పక్కదారి పట్టేవన్నారు. కానీ ఆధార్ లింక్ చేసి అవినీతిని అడ్డుకున్నామన్నారు. రైతుల ఖాతాల్లోనే పీఎం కిసాన్ నిధులు వేస్తామన్నారు. నిధులు నేరుగా లబ్దిదారులకే ఇస్తుండడంతో.. అవినీతిపరులకు కడుపు మండుతోందని ప్రధాని మోదీ అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్, తదితరులు పాల్గొన్నారు.




# చలన చిత్రం

## పుష్ప-2 గ్లింప్స్ విడుదలకు సన్నాహాలు





'పుష్ప' చిత్రంతో ప్యాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పొందారు ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ ఆ సినిమా సక్సెస్‌తో దానికి కొనసాగింపుగా రూపొందుతున్న 'పుష్ప'పై అంచనాలు భారీగా పెరిగాయి. దాంతో ఈ ప్రాజెక్ట్ బెటర్ అవుట్‌పుట్ కోసం దర్శకుడు సుకుమార్ మరింత దృష్టి సారించారు. చిత్రీకరణ దశ నుంచే ప్రత్యేక శ్రద్ధ తీసుకంటున్నారని, షూటింగ్‌తోపాటే ప్రచారాన్ని కూడా మొదలుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది. దీని కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. వచ్చే నెలలో 'పుష్ప 2'కుసంబంధించిన చిన్న గ్లింప్స్ వీడియో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేసున్నారట. దీనికి సంబంధించిన వర్క్ ఇప్పటికే మొదలైందని సమాచారం. ఇప్పటికే అల్లు అర్జున్‌పై కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారట. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో బన్నీ లేని సన్నివేశాలను ప్రత్యేకంగా రూపొందించిన సెట్‌లో చిత్రీకరిసున్నారు. సినిమా క్రేజ్‌ను మరింత పెంచేందుకు డిసెంబరు 16న విడుదల కానున్న 'అవతార్ 2' సినిమాతో పాటు ఈ చిత్ర గ్లింప్స్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. దీనితోనే విడుదల తేదీ గురించి కూడా క్లారిటీ ఇవ్వనున్నారని తెలుస్తోంది. ఈ గ్లింప్స్ విడుదలైతే అభిమానులకు పండగే! అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.




## ఎన్టీఆర్,కొరటాల శివ చిత్రం కోసం అభిమానుల ఎదురుచూపు

నందమూరి అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు కూడా ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్న చిత్రం ఎన్‌టిఆర్30'. 'ఆర్ఆర్ఆర్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత ఈ సినిమా తెరకెక్కనుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి. పైగా తారక్‌కు జనతా గ్యారేజ్ వంటి బ్లాక్‌బస్టర్ ఇచ్చిన, కొరటాల శివ 'ఎన్‌టిఆర్30'కు దర్శకత్వం వహించనుడటంతో ప్రేక్షకులు ఎగ్జైట్‌మెంట్‌తో ఉన్నారు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాజెక్ట్ క్యాన్సిల్ అయిందంటూ వస్తున్న వార్తలపై ఇటీవలే చిత్రబృందం ఒక్క ఫోటోతో క్లారిటీ ఇచ్చేసింది. ఇటీవలే మేకర్స్ కొరటాల శివ, సాబు సిరిల్, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు ప్రీ ప్రొడక్షన్ పనులలో నిమఘ్నమైనట్లు ఫోటోను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం చిత్రబృందం ప్రీ ప్రొడక్షన్ పనులను మరింత వేగవంతం చేసిందట. ఎట్టి పరిస్థితుల్లో ఈ సినిమాను డిసెంబర్‌లో సెట్స్ మీదకు తీసుకెళ్ళాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. ఇదిలా ఉంటే ఈ సినిమా టైటిల్‌కు సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి 'దేవర' అనే టైటిల్‌ను చిత్రబృందం పరిశీలనలో ఉంచినట్లు టాక్. అయితే గతంలో ఈ టైటిల్‌ను బండ్ల గణేశ్ పవన్ సినిమా కోసం రిజస్టర్ చేయించాడట. కాగా ఇప్పుడు కొరటాల శివ ఈ పేరును అనుకుంటున్నాడట. ఇందులో నిజమెంతుందో తెలియాలంటే మేకర్స్ నుండి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ఈ సినిమా మెడికల్ మాఫీయా నేపథ్యంలో తెరకెక్కనుందట. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని యువసుధ ఆర్ట్స్, ఎన్‌టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రంలో తారక్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటించనున్నట్లు టాక్. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నాడు.

## సమంతతో మరోమారు జోడీ కట్టనున్న నాగచైతన్య



సమంత-నాగచైతన్య విడాకుల ప్రకటన కేవలం దక్షిణాదినే కాదు ఉత్తరాదిన కూడా గతేడాది హాట్ టాపిక్ అయింది. ఎన్నో ఏళ్ళుగా ప్రేమలో ఉన్న ఈ జంట వివాహ బంధంలోకి అడుగుపెట్టిన నాలుగేళ్లకే విడిపోవడంతో.. అటు ప్రేక్షకులు, ఇటు సినీ సెలబ్రెటీలు ఒక్కసారిగా షాక్‌కు గురైయ్యారు. మనస్పర్థల కారణంగా వీరిద్దరూ తమ వైవాహిక జీవితానికి స్వస్తి చెప్పారు. విడిపోయిన తర్వాత కూడా వీరిద్దరూ స్నేహితులుగానే ఉంటున్నారట. ఇక ఇటీవలే సమంత మయోసైటిస్ అనే వ్యాధి బారిన పడిన విషయం తెలిసిందే. అయితే త్వరలోనే నాగార్జున, నాగచైతన్య.. సమంతను కలువబోతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే విడాకుల తర్వాత సమంత, నాగచైతన్య కలిసి నటించనున్నట్లు టాక్. 'ఏమాయ చేశావే' సినిమాతో వీరిద్దరూ మొదటి సారి కలిసి నటించారు. ఈ చిత్రం తర్వాత 'మనం',
'ఆటోనగర్ సూర్య', 'మజిలీ' వంటి చిత్రాల్లో నటించారు. అయితే తాజాగా వీరిద్దరూ కలిసి ఓ బిగ్ ప్రాజెక్ట్‌లో నటించనున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇదే నిజమైతే విడాకుల
తర్వాత వీరిద్ధరూ కలిసి నటించిన తొలి సినిమా ఇదే అవుతుంది. ఇందులో నిజమెంతుందో తెలియదు కానీ ఈ వార్తతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. వివాహ బంధానికి స్వస్తీ
చెప్పిన వీరిద్ధరూ ప్రొఫెషనల్ పరంగా కలిసి నటించడానికి సిద్ధంగా ఉంటామని ఎన్నో సందర్భాల్లో చెప్పారు. ఇక వీరిద్దరూ మళ్ళీ కలిసిపోవాలని ఎంతో మంది
కోరుకుంటున్నారు. విడాకుల తర్వాత సమంత, నాగచైతన్య వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా గుడుపుతున్నారు. ప్రస్తుతం నాగచైతన్య, వెంకట్‌ప్రభు దర్శకత్వంలో 'ఎన్‌సి22'
చేస్తున్నాడు.ఇక సమంత ఇటీవలే 'యశోద'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. శుక్రవారం రిలీజైన ఈ చిత్రం పాజిటీవ్ రివ్యూలను తెచ్చుకుని భారీ వసూళ్లు సాధిస్తుంది.
హరి-హరీష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సరోగసి కాన్సెప్ట్‌తో తెరకెక్కింది. దీనితో పాటుగా గుణశేఖర్ 'శాకుంతలం'లో నటిస్తుంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈచిత్రం
ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. ఇక విజయ్ దేవరకొండతో కలిసి 'ఖుషీ' చిత్రాన్ని కూడా చేస్తుంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం వచ్చే ఏడాది
ప్రథమార్థంలో ప్రేక్షకుల ముందుకు రానుంది.



## నాగచైతన్య సినిమాలో విలన్ రోల్‌లో అరవింద్ స్వామి

బంగార్రాజు, థ్యాంక్యూ, లాల్ సింగ్ చద్దా అంటూ ఈ ఏడాది మూడు డిఫరెంట్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన నాగ చైతన్య.. ఇప్పుడు యాక్షన్ ఓరియెంటెడ్ మూవీలో నటిస్తున్నాడు. వెంకట్ ప్రభు దర్శకుడు. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతోంది. ఆల్రెడీ ఓ షెడ్యూల్ కూడా పూర్తిచేసుకుంది. శుక్రవారం నుంచి భారీ యాక్షన్ షెడ్యూల్‌ను మొదలుపెట్టారు. హైవోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించేందుకు హైదరాబాద్‌లో భారీ సెట్ వేశారు. మహేష్ మాథ్యూ ఆథ్వర్యంలో ఈ్గ÷ట్ సీన్స్ తీస్తున్నారు. ఇందులో నాగ చైతన్య ఇంటెన్స్ క్యారెక్టర్‌లో కనిపించనున్నాడు. అరవింద్ స్వామి విలన్‌గా నటిస్తున్నారు. వీరిద్దరి మధ్య కీలక సన్నివేశాలను షూట్ చేస్తున్నారు. ఇంకా టైటిల్ పెట్టని ఈ సినిమా చైతూకి ఇరవై రెండోది. కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. శరత్ కుమార్, సంపత్ రాజ్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఇళయరాజా, యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తుడటం విశేషం.

## ధమాకాతో వస్తోన్న రవితేజ

సూపర్ స్పీడ్‌తో వరుస సినిమాలు చేస్తున్నాడు రవితేజ. ప్రస్తుతం నాలుగు చిత్రాల్లో అతను నటిస్తుండగా, వాటిలో ముందుగా రాబోతున్న సినిమా 'ధమాకా'. నక్కిన త్రినాథరావు దర్శకుడు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. జయరామ్, సచిన్ ఖేద్కర్, తనికెళ్ల భరణి, రావు రమేష్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే టీజర్‌తో పాటు 'జింతాక్' అనే పాటను విడుదల చేసిన టీమ్, శుక్రవారం మరో పాటను రిలీజ్ చేసింది. 'వాట్స్ హ్యాపెనింగ్ ఇన్ మై దిల్‌లో.. వాట్స్ హ్యాపెనింగ్ ఆన్ మై వేలో' అంటూ సాగే ఈ పాటను భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేయగా రమ్య బెహ్రా, భార్గవి పిళ్ళై పాడారు. రామజోగయ్య శాస్త్రి రాశారు. 'పది గంటలకే పడుకునేదాన్ని, వీడు వచ్చాకేమో రెండవుతోందే.. గది గడపలనే దాటనిదాన్ని తిరిగొచ్చే టైమ్ ఏమో ఏడవుతోందే .. బుజ్జి అంటూ, కన్నా అంటూ, వాడంటుంటే పడిచస్తున్నా' అని ప్రేమలో పడ్డ కొత్తలో హీరోయిన్, హీరో గురించి పాడుకుంటున్నట్టుగా ఉంది. 'డబుల్ ఇంపాక్ట్' క్యాప్షన్‌తో తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కి ప్రసన్న కుమార్ బెజవాడ కథ, స్క్రీన్‌ప్లే, మాటలు రాస్తున్నాడు. టీజీ విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ కలిసి నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. డిసెంబర్ 23న విడుదల కానుంది






## నాని సోదరి నిర్మాతగా మీట్‌క్యూట్

విడుదలకు సిద్ధంగా చిత్రం

నేచురల్ స్టార్ నాని హీరోగా ఎంత సక్సెస్ అయ్యాడో.. ప్రొడ్యూసర్‌గా కూడా అంతే సక్సెస్ అయ్యాడు. కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలను నిర్మిస్తూ.. కొత్త దర్శకులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాడు. ఇప్పటికే ఈయన నిర్మించిన 'ఆ!', 'హిట్' చిత్రాలు నానికి ప్రొడ్యూసర్‌గా లాభాలతో పాటు మంచి పేరును తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం నాని నిర్మించిన 'మీట్‌క్యూట్' రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. నాని సోదరి దీప్తి ఘట్టమనేని ఈ చిత్రాన్ని తెరకెక్కించింది. గతంలో ఈమె 'అనగనగా ఒక నాన్న' అనే షార్ట్ ఫిలిం తెరకెక్కించింది. ఈ షార్ట్ ఫిల్మ్‌కు గొప్ప ప్రశంసలు దక్కాయి. ఇక ఇప్పుడు మీట్‌క్యూట్‌తో ఫ్యూచర్ ఫిల్మ్ డైరెక్టర్‌గా మెగాఫోన్ పట్టింది. ఇటీవలే నాని రిలీజ్ చేసిన పోస్టర్‌కు ప్రేక్షకుల నుండి విశేష స్పందన వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఐదు భిన్న కథల ఆంథాలజీ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. ఐదు మీటింగ్స్‌లో పరిచయం లేని ఇద్దరిద్దరు వ్యక్తులు అనుకోకుండా కలుసుకొని తమ తమ అభిప్రాయాలు, వ్యక్తిత్వాల గురించి తెలుసుకున్నట్లు టీజర్ చూస్తే తెలుస్తుంది. ఐదు ఎపిసోడ్స్‌గా ఈ చిత్రం ఉండనుంది. టీజర్‌తోనే సినిమాపై విపరీతమైన అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఈ చిత్రం నేరుగా ఓటీటీలో రిలీజ్ కానుంది. ప్రముఖ ఓటీటీ సంస్థ సోనిలివ్‌లో ఈ సినిమా త్వరలోనే స్ట్రీమింగ్ కానున్నట్లు చిత్రబృందం పేర్కొంది.వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై నాని, ప్రశాంతి తిపర్నేని ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో రుహాని శర్మ, ఆకాంక్షసింగ్, ఆదా శర్మ, వర్షబొల్లమ్మ, సునైనావంటి కథానాయికలు నటించారు. కీలకపాత్రల్లో సత్యరాజ్, రోహిణి కనిపించనున్నారు.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in